ప్రజాశక్తి
శుక్రవారం 24 అక్టోబరు, 2025
5
శ్రీకాకుళం

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి- పలాస

కార్తీకమాస మహోత్సవం సందర్భంగా పంచారామ క్షేత్రాలకు పలాస ఆర్‌టిసి డిపో నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నామని మేనేజర్ ఎం.ఎస్.ఎస్.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో మధ్యాహ్నం రెండు గంటలకు బస్సులు బయలుదేరుతున్నాయని అన్నారు. పంచారామ క్షేత్రాల్లో భాగంగా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట వంటి క్షేత్రాల్లో సందర్శించినట్లు పేర్కొన్నారు, సూపర్ లగ్జరీ సర్వీస్‌కు రూ.2,700లు, అల్ట్రా డీలక్స్‌కు రూ.2,650 చొప్పున టిక్కెట్ ధరలను నిర్ణయించామని చెప్పారు. ఈ అవకాశాన్ని యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్ 9959225610, అసిస్టెంట్ మేనేజర్ 9949916017ను సంప్రదించాలన్నారు.

బూర్జ మండలం అల్లినలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ కప్పుతున్న రైతు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కోటబొమ్మాళి : బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరుచుకోవాలన్నారు. భారీ వర్షాలతో ఎక్కడెక్కడ వాగులు పొంగుతాయో అక్కడి ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.

వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. జిల్లాలో అక్కడక్కడా ఇప్పటికే కోతలు మొదలయ్యాయి. వాతావరణ పరిస్థితులను బేరీజు వేసుకుని కొన్నిచోట్ల పంటల కోతలకు సిద్ధమవుతున్నారు. వర్షాలు ఉధృతమైతే పరిస్థితి ఏమిటన్న దానిపై అన్నదాతల్లో కాస్త కలవరం మొదలైంది. కోతలు పూర్తయిన చోట పంట కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులకు ఉచితంగా టార్పాలిన్లు అందిస్తామని ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించినా, దానికి అతీగతి లేకుండా పోయింది. కనీసం అధికారులు ప్రతిపాదనలు కూడా పంపలేదని తెలుస్తోంది.

వాయుగుండం

- జిల్లాలో పలుచోట్ల వర్షాలు
- పోలాకిలో అత్యధికంగా 46.75 మి.మీ వర్షపాతం నమోదు
- అన్నదాతల్లో ఆందోళన
- అతీగతీ లేని ఉచిత టార్పాలిన్ల పంపిణీ
- అద్దెకు తీసుకుని అవస్థలు పడుతున్న రైతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో గురువారం ఉదయం నుంచే వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం, పలుచోట్ల వర్షాలు కురవడం మొదలు కావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ప్రధానంగా వరి రైతులు కొంత కలవరపడుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 3.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలో అన్నిచోట్ల సుమారు పంట కోత దశకు వచ్చింది. ఇప్పటికే అక్కడక్కడా కోతలూ మొదలుపెట్టేశారు. వాతావరణంలో మార్పులు, వర్షాలు కురుస్తుండడంతో కొంతమంది రైతులు వరి కోతలను వాయిదా వేసుకున్నారు. ఈ తరుణంలో వాయుగుండం వార్తలు రైతుల్లో గుబులు రేపుతోంది. భారీ వర్షాలు సంభవిస్తే పంట నేలకొరిగే అవకాశాలూ లేకపోలేదు.

అతీగతి లేని టార్పాలిన్ల సరఫరా

జిల్లాలో జలుమూరు, సారవకోట, హిరమండలం, ఎల్‌ఎన్‌పేట, కొత్తూరు, బూర్జ తదితర మండలాల్లో ఇప్పటికే పంట కోతలు ప్రారంభమయ్యాయి. వర్షాలు పడుతుండడంతో పంటను కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొంతమంది రైతులు రూ.1200 నుంచి రూ.1400 వరకు వెచ్చించి టార్పాలిన్లు కొనుగోలు చేస్తున్నారు. మరికొంతమంది రైతులు రోజుకు రూ.30 నుంచి రూ.40 వరకు అద్దెకు తీసుకొస్తున్నారు. గతంలో 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందించేవారు. రెండేళ్లుగా వాటినీ అందించడం లేదు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు ఈ సంవత్సరం ఉచితంగా టార్పాలిన్లు అందిస్తామని గొప్పగా ప్రకటించారు. అందుకు సంబంధించి ఇప్పటివరకు ఆ ప్రక్రియే మొదలు కాలేదని తెలుస్తోంది. జిల్లా అవసరాలకు కావాల్సిన టార్పాలిన్లపై కనీసం అధికారులు ప్రతిపాదనలు కూడా పంపలేదని తెలుస్తోంది.

పలుచోట్ల వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. పోలాకిలో అత్యధికంగా 46.75 మి.మీ వర్షం పడింది. కవిటి మండలం రాజపురంలో 33.5 మిమీ వర్షం కురిసింది. గారలో 20.75 మి.మీ వర్షం, కంచిలిలో 19.5 మి.మీ, కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో 17.5 మి.మీ, ఇచ్ఛాపురంలో 13 మి.మీ, ఎల్‌ఎన్ పేటలో 11.5 మి.మీ వర్షం కురిసింది. లావేరులో 0.5 మి.మీ వర్షపాతం నమోదైంది.

లావేరు : నారీశక్తి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఐజి గోపీనాథ్ జట్టి

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

- సిబ్బందికి శిక్షణ, అధునాతన పరికరాలు అందిస్తాం
- పోక్సో చట్టంపై విస్తృత అవగాహన
- సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు
- విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి అన్నారు. శ్రీకాకుళం సబ్‌డివిజన్ పరిధిలోని శ్రీకాకుళం డిఎస్‌పి కార్యాలయం, శ్రీకాకుళం రెండో పట్టణ, లావేరు పోలీస్‌స్టేషన్లను గురువారం తనిఖీ చేశారు. ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డితో కలిసి శ్రీకాకుళం రెండోపట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సైబర్ కేసుల ఛేదనలో పెద్దగా పురోగతి లేదన్నారు. బాధితుల నుంచి కేసులు స్వీకరించడంలోనూ కొంత లోపం ఉందన్నారు. సైబర్ మోసం జరిగిన తర్వాత ఆ డబ్బు రకరకాల ఖాతాల్లోకి వెళ్లిపోవడం, నేరగాళ్లు విదేశాలు, దేశంలోని మారుమూల ప్రాంతాల్లో ఉండి మోసానికి పాల్పడడం వల్ల కేసుల్లో పురోగతి కనిపించడం లేదన్నారు. రాబోయే రోజుల్లో సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు కొత్త పరికరాలను అందిస్తామని తెలిపారు. ప్రాపర్టీ, పోక్సో కేసుల విచారణలో వేగవంతమైన పురోగతి సాధించేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశామన్నారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గడిచిన ఏడాదిలో ప్రాపర్టీ కేసులు ఎక్కువగా నమోదయ్యాయని, దర్యాప్తులో ఆశించిన స్థాయిలో పురోగతి లేదన్నారు. బాలికల భద్రతకు సంబంధించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విద్యాసంస్థల్లో పోక్సో చట్టంపై విస్తృతంగా అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం వారి బంధువులు ఎవరైనా వస్తే, తల్లిదండ్రులను సంప్రదించి వారి వివరాలపై యాజమాన్యం ఆరా తీయాలన్నారు. పోక్సో కేసుల్లో బంధువులే ఎక్కువగా నేరస్తులుగా ఉంటున్నారని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తులను కించపరిచేలా తప్పుడు పోస్టింగ్‌లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బు వస్తుందన్న ఆశతో కొంతమంది సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడుతున్నారని తెలిపారు. గంజాయి రవాణాతో పాటు సేవించిన వారిపైనా కేసులు పెడతామని హెచ్చరించారు.

డిఎస్‌పి కార్యాలయం తనిఖీ

శ్రీకాకుళం, లావేరు : శ్రీకాకుళం సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయాన్ని, రెండో పట్టణ, ట్రాఫిక్, మహిళా, లావేరు పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. పలు రికార్డులను, ప్రాపర్టీ, కంప్యూటర్ గదులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాపర్టీ, పోక్సో, ఎస్‌సి ఎస్‌టి కేసుల సిడి ఫైల్స్‌ను చూశారు. ఆయా కేసుల్లో దర్యాప్తును నిర్దిష్ట సమయంలోగా పూర్తి చేయాలని, నిందితులపై ఛార్జిషీట్లను దాఖలు చేయాలని ఆదేశించారు. గంజాయి నియంత్రణకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరును, శాంతిభద్రతల విషయాలను డిఎస్‌పి వివేకానందని అడిగి తెలుసుకున్నారు. లావేరు పోలీస్‌స్టేషన్ తనిఖీ అనంతరం జె.ఆర్ పురం సర్కిల్ పరిధిలోని సచివాలయ మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. నారీశక్తి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన వెంట జె.ఆర్ పురం సిఐ ఎం.అవతారాం, ఎస్‌ఐలు లక్ష్మణరావు, ఎస్.చిరంజీవి తదితరులు ఉన్నారు.

నవోదయ విద్యాలయం ఎదుట బైఠాయించిన గిరిజనులు

థర్మల్ ప్రతిపాదిత గ్రామాల్లో రహస్య డ్రోన్ సర్వే

నవోదయ విద్యాలయం ఎదుట గిరిజనుల బైఠాయింపు

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద థర్మల్ ప్లాంట్ ప్రతిపాదిత గ్రామాల్లో అధికారులు గురువారం సాయంత్రం రహస్యంగా డ్రోన్ సర్వే చేపట్టారు. నవోదయ విద్యాలయం లోపల నుంచి సర్వే చేపట్టగా, డ్రోన్లను గమనించిన గిరిజనులు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. విద్యాలయం గేటు వద్ద బైఠాయించి థర్మల్ పవర్ ప్లాంట్ సర్వేకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఆమదాలవలస సిఐ పి.సత్యనారాయణ ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో కలిసి నవోదయ విద్యాలయానికి చేరుకున్నారు. గిరిజనులకు నచ్చజెప్పేందుకు పోలీసులు ప్రయత్నించగా, లోపల ఉన్న అధికారులు బయటకు రావాలని, రహస్య సర్వే ఎందుకు చేస్తున్నారో చెప్పాలని పట్టుబట్టారు. సర్వే అధికారులను బయటకు పంపకపోతే తాము ఇక్కడ్నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం దొంగచాటుగా సర్వేలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.12 కోట్లతో అరసవల్లి అభివృద్ధి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- అరసవల్లి

రూ.12 కోట్లతో అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అరసవల్లి అనివెట్టి మండపంలో అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఏడాది రథసప్తమి వేడుకలు ఏడు రోజులపాటు అత్యంత అద్భుతంగా ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రసాద స్కీమ్‌లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేశామన్నారు. పుష్కర పనులకు రూ.4 కోట్లు కేటాయించి సుందరంగా తయారు చేస్తామన్నారు. అనివెట్టి మండపం, గాలిగోపురం, సూర్యనారాయణ స్వామి పూజలు నిర్వహించుకున్న చోట మార్పులు చేసి రాష్ట్రంలోని అతిపెద్ద ఆలయాలు మాదిరిగా మార్పులు చేస్తామని తెలిపారు. ప్రసాదాల కౌంటర్, అన్నదాన సత్రం, కేశఖండనశాల, యాత్రికుల స్నానాల గది, పార్కింగ్ స్థలం అన్నీ ఆధునికీరణకు ప్రణాళికలు చేస్తున్నట్టు చెప్పారు. యాత్రికులు విశ్రాంతి తీసుకోవడానికి వెయిటింగ్ హాల్‌లూ నిర్మిస్తామన్నారు. వివిధ కౌంటర్లలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వెంటనే జీతాలు ఇవ్వాలని ఆలయ ఇఒ కె.ఎన్.వి.డి.ప్రసాద్‌కు ఆదేశించారు. ఇకపై అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని విశ్రాంత పొందిన ఉద్యోగులను నియమించాలన్నారు. అలాగే డిప్యూటీ, అసిస్టెంట్ ఇంజినీరింగ్ పోస్టులను భర్తీ చేయాలని దేవాదాయశాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్రరావుకు ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం బ్రాహ్మణ వీధిలో ఆలయానికి సంబంధించిన భూమిని పరిశీలించారు. సన్‌రైజ్ హోటల్ పక్కన ఉన్న ఆలయ భూముల్లో ఆలయ కాలేజీ నిర్మాణానికి సన్నాహాలు చేపట్టాలని నగరపాలక కార్పొరేషన్ సంస్థ, అర్బన్ డెవప్‌మెంట్, సుడా ఇఇ సుగుణాకరరావుకు ఆదేశించారు. శుక్రవారం నుంచి రోజూ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక నిపుణులతో డిజైన్ చేయాలన్నారు. అనంతరం నరార్యనారాయణస్వామిని సందర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ స్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, నగర కార్పొరేషన్ కమిసనర్ ఆర్.డి.వి.ప్రసాదరావు, ఆర్‌డిఒ సాయిప్రత్యూష పాల్గొన్నారు.

అంధునికి ఎఐ విజన్ గ్లాసులు అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఎఐతో అంధులకు వెలుగు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- జెమ్స్‌లో వంద మంది అంధులకు ఎఐ విజన్ గ్లాసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

అంధులకు కృత్రిమ మేధ (ఎఐ) ఆధారిత విజన్ గ్లాసులు భరోసా కల్పిస్తాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జెమ్స్ హాస్పిటల్, కిమ్స్ ఫౌండేషన్, రీసెర్చ్ సెంటర్, ఆచల హెల్త్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యాన రాగోలులోని జెమ్స్ హాస్పిటల్‌లో వంద మంది అంధులకు ఎఐ విజన్ గ్లాసులను ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధులకు ఈ స్మార్ట్ విజన్ గ్లాసులు పరిసరాలను గుర్తించేందుకు, చదవడానికి, స్వతంత్రంగా కదలడానికి సహాయపడతాయన్నారు. వారి జీవితాలలో కొత్త ఆశ, ధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని నింపుతాయన్నారు. కార్యక్రమంలో జెమ్స్ హాస్పిటల్ చీఫ్ మెంటర్ డా.బొల్లినేని భాస్కరరావు, కిమ్స్ చైర్మన్ డా.భుజంగరావు, అచల హెల్త్ సర్వీస్ సిఇఒ రాజేష్ రాజు, డీన్ డా.లక్ష్మీ లలిత, డా.సుధీర్, డా.అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై కఠిన చర్యలు

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్ రెడ్డి, ఎక్సైజ్ అధికారి సిహెచ్.తిరుపతి నాయుడు హెచ్చరించారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని బెల్ట్‌షాపులను మూసివేశామని, ఇకపై ఎటువంటి లైసెన్సు లేకుండా గ్రామాల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు నాణ్యమైన లిక్కర్ అందించేందుకు ప్రభుత్వం 'సురక్ష' యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ యాప్ ద్వారా లిక్కర్ షాపుదారులు డిపో నుంచి వచ్చిన సరుకును షాప్ వద్దకే రాగానే స్కాన్ చేసి, కల్తీ లేని నాణ్యమైన ఉత్పత్తి వచ్చిందా అని నిర్ధారించుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. వినియోగదారునికి విక్రయించే ముందు లైసెన్సుదారుడు బాటిల్‌ను స్కాన్ చేసి 'గుడ్' అని చూపితేనే అమ్మాలని సూచించారు. వినియోగదారులు కూడా తమ వద్ద ఉన్న బాటిల్‌పై అనుమానం ఉంటే సురక్ష యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఉత్పత్తి అసలైనదో లేదో తెలుసుకోవచ్చని తెలిపారు. గూగుల్ ప్లేస్టోర్ ద్వారా యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. లైసెన్సుదారులు వినియోగదారులకు మూడు బాటిళ్లకు మించి అమ్మరాదని స్పష్టం చేశారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా..

28న నియోజకవర్గాల్లో ర్యాలీలు

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణదాస్, వైసిపి నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 28న జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ వెల్లడించారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వైద్యం, వైద్య విద్యను పేదలకు దూరం చేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వల్ల అనేక నష్టాలు ఉంటాయన్నారు. గ్రామస్థాయిలోకి ఈ అంశాన్ని తీసుకెళ్తూ కోటి సంతకాల సేకరణ చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభించిందన్నారు. 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్మించాలని డిమాండ్ చేశారు. బోధనాస్పత్రుల వల్ల మారుమూల ప్రాంతాలకు మెరుగైన వైద్యం అందడంతో పాటు గ్రామీణ ప్రాంత పేద పిల్లలకు వైద్య విద్య చేరువవుతుందని చెప్పారు. గూగుల్ డేటా సెంటర్‌కు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం, వైద్య విద్యపై నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. పేద ప్రజల సంక్షేమం పక్కన పెట్టి కార్పొరేట్లకు మద్దతుగా ప్రభుత్వం నిలుస్తోందని విమర్శించారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకపోతే భవిష్యత్‌లో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ ప్రజలకు దూరమైందని, భవిష్యత్‌లో వైద్యాన్నీ పేదలకు దూరం చేసే ప్రయత్నాలు ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.వి పద్మావతి, ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న జీడి పరిశ్రమ కార్మికులు

జీడి పరిశ్రమను తెరిపించాలి

సత్యసాయి కాష్యూ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - మందస

పది నెలలుగా మూసివేసిన సత్యసాయి జీడి పరిశ్రమను తెరిపించాలని సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎన్.గణపతి, కె.కేశవరావు, జీడి కార్మిక సంఘం నాయకులు జి.బాలమ్మ, బి.సునీత డిమాండ్ చేశారు. సిఐటియు, జీడి కార్మిక సంఘం ఆధ్వర్యాన సత్యసాయి జీడి పరిశ్రమ వద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. ధర్నాకు రైస్ మిల్లు కార్మిక సంఘం నాయకులు కె.కృష్ణారావు, ఆర్.ఏకాశి, బి.రమేష్ సంఘీభావం తెలిపారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ధర్నాకు అనుమతి లేదని చెప్పడంతో యూనియన్ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం నాయకులు మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో పది నెలలుగా సత్యసాయి జీడి పరిశ్రమను మూసివేయడంతో, కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ మూసివేసిన కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లించాలని, గత బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నూతన ఒప్పందంలో భాగంగా పెరిగిన కూలి రేట్ల ప్రకారం బకాయిల ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో జీడి సంఘం నాయకులు డి.మీన, డి.భారతి, బి.వరలక్ష్మి, కె.వరలక్ష్మి, టి.కుమారి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

అభివృద్ధి పేరుతో భూములు కబ్జా

వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అభివృద్ధి పేరుతో ప్రభుత్వ భూములు, వనరులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కబ్జా చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు, నగరంలోని సుందరయ్య భవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూ కబ్జాలు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, రైతుసంఘాల ఆధ్వర్యాన వచ్చే ఏడాది జనవరి 19వ తేదీన దేశవ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు రూ.22 వేల కోట్ల రాయితీలు ఇస్తున్నారని, ఇది ఒక రకమైన ప్రజల ఆస్తుల కబ్జా చేయడమేనన్నారు. అభివృద్ధి పేరుతో చేపడుతున్న భూముల కబ్జాను వ్యతిరేకిస్తామన్నారు. ఎన్‌టిఆర్ వైద్యసేవ సేవలను నెట్‌వర్క్ ఆస్పత్రులు నిలిపివేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు అప్పగించడం సరికాదన్నారు. పి-4 పేరిట ధనవంతులకు దత్తత ఇస్తే పేదరికం నిర్మూలన సాధ్యం కాదని, పేదలకు భూములు ఇవ్వడం ద్వారానే అది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ ఉన్నారు.


తహశీల్దార్‌తో మాట్లాడుతున్న నాయకులు

గత సర్వేయర్లు చేసిన తప్పిదాలే...

ప్రజాశక్తి - మందస

మందస మండలం కొండల్లోగా పంచాయతీ చాపరాయిలో కొద్ది రోజులుగా భూముల రీ సర్వే వ్యవహారం తేలడం లేదని ఎపి రైతు కూలీ సంఘం నాయకులు కోనేరు రమేష్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షులు సవర నర్సింహులు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో గిరిజన సంఘ నాయకులతో తహశీల్దార్ శ్రీకాంత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ మాధవరావు, జయరాజు 50 ఏళ్లుగా బిడిఆర్‌లో ఉన్న మూడు ఎకరాలు జిరాయితీలో రెండు ఎకరాలు మా ఆధ్వర్యానే ఉన్నాయన్నారు. వాటిద్వారా వచ్చే ఫలాలు ఇప్పటికీ అనుభవిస్తున్నామని తెలిపారు. ఓ పక్క అమరావతి రెస్టారెంట్‌కి సంబంధించిన సుదర్శన్ యాదవ్ రౌడీలను తీసుకువచ్చే బెదిరిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులూ వారు చెప్పిందే సిద్ధాంతం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సుదర్శన్ నాలుగు ఎకరాల కొనుగోలు చేసిన పత్రాలు చూపించాలన్నారు. దీనిపై తహశీల్దార్ స్పందించి రెండు రోజులు గడువు ఇస్తే అస్సలు నిజం తేలుస్తామని భరోసా ఇచ్చారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ ఛాన్సలర్ రజని తదితరులు

జాతీయ సమైక్యత యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యత యాత్ర నిర్వహించనున్నారు. కేంద్ర యువజన, క్రీడా వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని మేరా భారత్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) జిల్లా శాఖలు సంయుక్తంగా ఈ యాత్రను అక్టోబర్ 31న శ్రీకాకుళం పట్టణంలో చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను డా. బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని గురువారం తన ఛాంబర్‌లో ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ యాత్రలో జిల్లాలోని పలు విద్యాసంస్థలతో పాటు డా. బిఆర్ఎయు విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొనున్నారు. కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, మేరాభారత్ జిల్లా సహాయ సంచాలకులు కె.వి.ఉజ్వల్, వర్శిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డా.ఎస్.ఉదయాభాస్కర్, డా. ఎం.అనురాధ, ఎస్ఒ డా.కె.సామ్రాజ్యలక్ష్మి, ఎన్.ఎస్.ఎస్. జిల్లా కో-ఆర్డినేటర్ డా. డి.వనజ, అకడమిక్ అఫైర్స్ డీన్ డా. కె.స్వప్నవాహిని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ఇంటింటికీ తాగునీరు

పలాస: మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ తాగునీరు అందేలా చూడాలని, ఆ దిశగా అధికారులు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపాలిటీ అభివృద్ధిపై అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో ఎంత అభివృద్ధి చేసుకున్నామో చెప్పుకునే విధంగా ఉండాలన్నారు. చిన్నపాటి వర్షాలకు కాలువలలో నీరు రోడ్లపైకి వచ్చి చెరువులను తలపిస్తునాయని, అటువంటి ప్రాంతాలను గుర్తించి రోడ్లు, కాలువలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఎంపీ ల్యాండ్, ఇతర నిధులు తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పారు. మున్సిపాలిటీ సమస్యలపై సమావేశం నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలన్నారు. పలాసకు శుద్ధ జలాలను తీసుకురావడానికి మనం ఎంత కష్టపడ్డామో అధికారులకు తెలుసునని అన్నారు. కిడ్నీ వ్యాధులు నివారణకు శుద్ధజలాలు ఎంతో అవసమని, అటువంటి శుద్ధజలాలే ఉచితంగా వస్తున్నాయని అన్నారు. శుద్ధజలాలను నిర్లక్ష్యం చేసి కాలువల్లోకి విడిచిపెట్టడం బాధాకరంగా ఉందన్నారు. శుద్ధజలాలు వినియోగంపై వైద్యులతో ఒక బృందం ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, ఎంఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, కమిషనర్ ఎన్.రామారావు, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న రాజేష్

రాజేష్ ఆదర్శం

కవిటి: జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోళ్ల రాజేష్ రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న మండలంలోని వరకకు చెందిన ప్రవీణ్ పురియాకు గురువారం అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైంది. అందుబాటులో రక్తదాతలు లేకపోవడంతో విషయం తెలుసుకున్న రాజేష్ తానున్నానని ముందుకొచ్చారు. వెంటనే ఉద్దానం బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన రక్తదానం చేసి తలసేమియా బాలుడికి అందించారు. విషయం తెలుసుకున్న స్థానికులు, జన సైనికులు శభాష్ నాయకా అంటూ రాజేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో పెద్దింటి రవీంద్ర వర్ధన్, డి.ఉమాపతి, జి.శంకర్, బి.దాలయ్య, బెందాళం శివప్రసాద్, గున్న ధనుంజయ, సనపల పృథ్వీ పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై వివరించాలి

లావేరు: పిజిఆర్ఎస్ ఫిర్యాదులు పరిష్కారంపై మండల, గ్రామస్థాయి అధికారులు గ్రామాల్లోని ప్రజలకు వివరించాలని కొవ్వాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.లక్ష్మణమూర్తి అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అన్ని శాఖలకు చెందిన మండల, గ్రామస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై నోటీసులు, విచారణపై గ్రామాల్లో విపులంగా వివరించాలని, వారికి అలా తెలియకపోవడంతో ప్రభుత్వం పంపిస్తున్న ఐవిఆర్ఎస్‌లో నెగిటివ్‌గా చెపుతున్నారన్నారు. ఇకనుంచి అలా కాకుండా ప్రజలు, ఫిర్యాదు దారులకు నోటీసులు, విచారణపై వారికి అర్థం అయ్యేరీతిలో వివరించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ జివిఎల్ఇ శ్రీనువాసరావు, డిప్యూటీ ఎంపిడిఒ పద్మజ, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - రణస్థలం

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, ప్రైవేటీకరణ విధానాలు ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 20న విజయవాడలో జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పైడిభీమవరం 132 కెవి సబ్‌స్టేషన్, సంచాం 220/132 కెవి సబ్‌స్టేషన్‌లో గురువారం పోస్టర్లను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, జెఎల్‌ఎం గ్రేడ్2లు, పీస్ రేట్ వర్కర్లు, స్టోర్ హమాలీస్, రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యంతో అనేకసార్లు చర్చలు, విజ్ఞాపన పత్రాలు, ధర్నాలు నిర్వహించినా యాజమాన్యం, ప్రభుత్వం నుంచి సరైన స్పందన కరువైందన్నారు. ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ప్రధానంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సంస్థలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని, గ్రేడ్ టు జెఎల్‌ఎంలకు ఎపిఎస్ఇబి సర్వీస్ రూల్స్ వర్తింప చేయాలని, ఉద్యోగభద్రత, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. నవంబర్ 20న విజయవాడలో జరిగే ఛలో విద్యుత్ సౌధా కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పీస్ట్ కార్మికులు, గ్రేడ్ 2 జెఎల్‌ఎంలు, రెగ్యులర్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

జాడలేని రవీంద్ర భారతి యాజమాన్యం

- వెనుదిరిగిన విద్యాశాఖ అధికారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని రవీంద్ర భారతి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం జాడ లేకపోవడంతో విచారణకు వచ్చిన జిల్లా విద్యాశాఖ అధికారులు వెనుదిరిగిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బుధవారం ఇఎస్ఐ బకాయిల కారణంగా కార్మికశాఖ ఆధ్వర్యంలో పాఠశాల సీజ్ చేయబడిన నేపథ్యంలో పాఠశాల పరిస్థితులు తెలుసుకోవడానికి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయ కుమారి పట్టణంలోని రవీంద్ర భారతి పాఠశాలను పరిశీలించడానికి వచ్చారు. అయితే పాఠశాల వద్ద యాజమాన్యానికి చెందిన ఎవరూ లేకపోవడంతో ఆమె అక్కడి నుంచి వెనుదిరగడంతో విచారణ నిలిచిపోయింది. పాఠశాల మూతపడి పోవడంతో తమ పిల్లల భవిష్యత్‌పై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యంతో చర్చించి బకాయిలు చెల్లింపజేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠశాల తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలన్న ఉద్దేశంతో అధికారులు వచ్చినప్పటికీ, యాజమాన్యం అందుబాటులో లేకపోవడంతో చేసేదేమీ లేక వెనుదిరిగినట్లు డిప్యూటీ డిఇఒ విజయకుమారి తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఈమెతో పాటు మండల విద్యాశాఖ అధికారి కె.అప్పల రాములు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ విజయ్‌కుమారి

ఎన్నికైన ఎస్ఎంసిబిఐఎ కార్యవర్గ సభ్యులు

ఎస్ఎంసిబిఐఎ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లా ఎస్ఎంసిబిఐఎ కార్యవర్గం ఎన్నిక నగరంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్‌గా గొర్లె వెంకట రామానాయుడు, జనరల్ సెక్రటరీగా చల్ల సింహాచలం, వైస్ ప్రెసిడెంట్‌గా గ్రంథి వెంకట గణేష్, జాయింట్ సెక్రటరీగా యాళ్ల రామారావు, జాయింట్ సెక్రటరీగా కిల్లి మోహనరావు, కోశాధికారిగా లోహిత్ కన్‌స్ట్రక్షన్ బడాన హరికృష్ణ, గౌరవ అధ్యక్షులుగా బగాది త్రినాథరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని కాంట్రాక్టర్ల సమస్యలు సమర్థవంతంగా పరిష్కారానికి ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. యూనియన్ ఐక్యంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వానికి సహకరిస్తూ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు చెప్పారు.

సందడిగా ఫ్రెషర్స్ డే

నరసన్నపేట: క్రమశిక్షణ ద్వారా మాత్రమే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని, ఈ దశలోనే లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలని నర్సన్నపేట సిఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్ డే వేడుకలు సందడిగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాను విజ్ఞానం పొందడానికి వాడాలన్నారు. అది మన సమయాన్ని వృథా చేయకుండా చూసుకోవాలన్నారు. పద్మావతి విద్యా సంస్థల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యతతోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇ.ఎం.నాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకగా సాగాయి.

అభివృద్ధి పనులు పరిశీలన

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఖుర్దా రైల్వే అధికారులు ఎసిఎం అవిక్ కుమార్ గైన్, రైల్వేస్టేషన్ సిబిఎస్ ఇన్‌ఛార్జి ఎ.రమణ, సిఎంఐ అజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ మేరకు సంతృప్తి వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేయాలని చేయాలని సూచించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

కొత్తమ్మతల్లి ఆలయం సందర్శన

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లిని జిల్లా విజిలెన్స్ ఎస్‌పి బి.ప్రసాదరావు, సిఐ సతీష్‌లు గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సాంప్రదాయం ప్రకారం కొత్తమ్మతల్లి ఇఒ రాధాకృష్ణ, ఆలయ చైర్మన్ కోరాడ గోవిందరావు పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో సుమారు రెండు వేలు మందికి ఆలయ అధికారులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - బూర్జ

రాష్ట్రంలోని అన్ని పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం బూర్జ పంచాయతీలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.95 లక్షలతో మంచినీటి ట్యాంక్, ఇంటింటి కుళాయిల పథకాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు చేరేలా జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేశామని, ఇంకా నియోజవర్గంలో విస్తృతంగా అన్ని శాఖల్లో అభివృద్ధికి సంబంధించిన పనులు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సక్రమంగా ఉపయోగించు కోవాలని సూచించారు. అంతేకాకుండా గ్రామంలో నెలకొని వున్న సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సిఎం చంద్రబాబు ఒకవైపు రాష్ట్ర అభివృద్ధి, మరో వైపు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అయితే అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. అంతకు ముందు ఎస్‌సి కాలనీలో రూ.5 లక్షలతో మరమ్మతులు పూర్తిచేసిన సామాజిక భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీప, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు వావిలిపల్లి సీతారాం బాబు నాయుడు, పీరుకట్ల సీతబాబు, ఎన్ఆర్ఐ వెంకటేష్, వేగు అనురాధ, ఎంపిటిసి చొక్కర పోలినాయుడు, ఇఒపి ఆర్‌డి కె.విజయలక్ష్మి, డిప్యుటీ తహశీల్దార్ బి.సత్యవతి, ఆర్‌డ బ్ల్యుఎస్, పంచాయతీ రాజ్ జెఇలు మణికుమార్, ఎంవికె నాయుడు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

కోటబొమ్మాళి : మాట్లాడుతున్న సీతారాం

ప్రైవేటీకరణ చేయొద్దు

కోటబొమ్మాళి: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయొద్దని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపల్లి, సరియాపల్లి, కురుడు పంచాయతీల్లో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అధ్యక్షతన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు హేమసుందర్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు రామారావు, జెడ్‌పిటిసి వెంకటరావు, నాయకులు లక్ష్మణరావు, సోమేశ్వరరావు, అనసూయ పాల్గొన్నారు.

పోలాకి : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ చేయొద్దని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. మండలంలోని రాళ్లపాడు, గొల్లలవలస, దీర్ఘాశి క్లస్టర్ పరిధి రచ్చబండ గురువారం నిర్వహించి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి కార్యకర్తలు ప్రచారం చేయాలన్నారు. అనంతరం గ్రామ కమిటీలను పూర్తి చేసి వైసిపి కార్యాలయానికి పంపాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్లు తెచ్చా

కొత్తూరు: పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు నిధులు ఈ 16 నెలలు కాలంలో తీసుకొచ్చానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు అగతముడి మాధవరావుతో కలిసి కమిటీ ప్రమాణస్వీకారం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వంశధార నదికి ఇరువైపులా కరకట్టలు నిర్మాణానికి రూ.400 కోట్లు, తాగునీటికి రూ.260 కోట్లు, శిరుసువాడ, కుంటిభద్ర, కడుము మారుమూల గ్రామాలకు రోడ్లకు, అభివృద్ధి నిధులు మంజూరు చేశామన్నారు. వంశధార నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. హిరమండలం మండలం శుభలాయికు చెందిన మంజుల క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆమెకు డాక్టర్ ఎ.అప్పలనాయుడు రూ.15 వేలును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న జీతభత్యాల నుంచి రూ.50 వేలు ఇస్తానని ఎమ్మెల్యే మాట ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ అబ్జర్వర్ బుద్దల త్రినాథరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ, టిడిపి నాయకులు అగతముడి భైరాగినాయుడు, అరుణ్ కుమార్, జి.మోహనరావు, దశరథ, చోడవరపు రాము, ఎం.కృష్ణ, పి.లక్ష్మణరావు, బమ్మిడి రాజు, లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, వై.దాసునాయుడు, కుంచాల నూకరాజు, జై.రాజు, అదపాక అశోక్, చుక్క రాంబాబు, టి.తిరుపతిరావు, జి.కమలాకర్, వి.వెంకటరావు, బి.సూర్యప్రసాద్, నాగళ్ల అప్పన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

అబుదాబిలో ఇచ్ఛాపురం వాసి మృతి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

విజయ్ (ఫైల్)

మండలంలోని సన్యాసి పుట్టుగకు చెందిన మాసుపత్రి విజయ్ (23) అబుదాభిలో అనుమానాస్పద స్థితిలో గురువారం మృతి చెందారు. ఏడు నెలలు క్రితం అబుదాభిలోని ఎన్‌ఎచ్‌ఎస్ కంపెనీకి కన్స్ట్రక్షన్ స్ట్రాచలర్ ఫిట్టర్‌గా వెళ్లాడు. అన్నయ్య బన్నీ కూడా అక్కడే పనిచేస్తున్నారు. చివరగా బుధవారం తెల్లవారు జామున ఆరు గంటలకు మాట్లాడిన విజయ్ క్షేమంగా ఉన్నట్టు తెలిపారు. గురువారం వేకువ జామున అన్న బన్ని ద్వారా విషయం తెలుసుకున్నట్లుగా మృతుడు తల్లిదండ్రులు శంకర్, లోలమ్మ తెలిపారు. కుమారుని మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తన కుమారుడు విజయ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావాలని ప్రభుత్వానికి కోరారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

నిందితులను అరెస్టు చేసిన సిఐ శ్రీనివాసరావు

గంజాయితో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

గంజాయితో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామని సిఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిందితులను గురువారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాంద్రాడ పంచాయతీ నర్సింగపల్లి-తిలారు రోడ్డులో గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం వచ్చిందన్నారు. ఎస్ఐ వి.సత్యనారాయణ తన సిబ్బందితో వెళ్లి దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకున్నారన్నారు. మండలం నిమ్మాడ కూడలికి చెందిన సినిమింటి త్రినాథ్ బరంపురంలో ఉంటూ చెత్తను వేరు కొని జీవిస్తూ... గంజాయికి, మద్యానికి బానిసయ్యాడని అన్నారు. దీంతో బరంపురానికి చెందిన సిగరెట్ల వ్యాపారి విజయ్ పట్నాయక్ పరిచయం ఏర్పాడని తెలిపారు. వీరిద్దరూ గంజాయిని ఒడిశా రాష్ట్రంలోని ఉదయగిరిలో కొనుగోలు చేసి ఆ గంజాయిని నిమ్మాడ తదితర ప్రాంతాల్లో గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న వ్యక్తులకు విక్రయిస్తుంటారని అన్నారు. త్రినాథ్ తన స్వగ్రామం నిమ్మాడ వచ్చినప్పుడు బెవర శ్రీనివాసరావు, తోట వెంకట్, సామ్రాట్‌లతో పరిచయమై వారి వద్ద గంజాయిని కొనుక్కొని తాగుతూ ఉంటారని అన్నారు. వీరికి గంజాయి అవసరం రాగా, త్రినాథ్‌కు ఫోన్ చేయటంతో ఉదయగిరిలో నాలుగు కేజీల 850 గ్రాముల గంజాయిని గుర్తు తెలియని వ్యక్తి వద్ద గురువారం కొనుగోలు చేశారని అన్నారు. ఐదు ప్యాకెట్లుగా చేసుకొని నిమ్మాడ కూడలి తిలారు రోడ్డుకు తీసుకొచ్చారని చెప్పారు. అక్కడ ప్యాకెట్లు విక్రయిస్తున్న సమయంలో ఎస్ఐ, సిబ్బంది వారిని పట్టుకొని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారిని అరెస్టు చేసి గంజాయి, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులను పాతపట్నం కోర్టులో హాజరుపరిచ్చామన్నారు.

పోక్సో కేసు నమోదు

రణస్థలం: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి గురువారం తెలిపారు. జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిషిణి గ్రామానికి చెందిన మైనర్ బాలిక రణస్థలం ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుంది. బాలికకు అదే గ్రామానికి చెందిన పిన్నింటి రామారావు అనే యువకుడితో పరిచయం ఉంది. ఆ పరిచయంతో మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈవిషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆ యువకుడిపై అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ బోల్తా

రణస్థలం: జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి దన్నానపేట సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీబోల్తా పడింది. వివరాల్లోనికి వెళితే.. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ ముందు వెళ్తున్న ఆటోని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. అయితే ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. లారీ బోల్తా పడడంతో క్లినర్ లారీ లోపల ఇరుక్కుపోవడంతో స్థానికులు బయటకు తీశారు. ఎవరికీ ఏమి జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

మొక్కజొన్న బస్తాలు చోరీ

కొత్తూరు : మండల కేంద్రానికి చెందిన పెదకోట ఆనందరావు అనే రైతు మండలంలోని కర్లెమ్మ పంచాయతీ బడిగాం సమీపంలో నాలుగు ఎకరాలు మెట్టు భూమిలో మొక్కజొన్న పంటను పండించారు. ఆ పంటను బడిగాం దగ్గర రోడ్డుపై గత మూడు రోజులుగా ఎండబెట్టారు. వాటిని బస్తాలుగా వేసి నిల్వ ఉంచారు. ఈ నెల 22న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 15 క్వింటాళ్ల మొక్కజొన్నలను దొంగిలించుకుపోయారు. గురువారం వేకువజామున 5 గంటలకు రైతు వెళ్లి చూడగా దొంగతానికి గురైనట్టు గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త ఇంటి ముందు బాలింత దీక్ష

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

దంపతుల మూడేళ్ల వివాహ బంధానికి 11 నెలల పాప నిదర్శనం. అయితే తండ్రి నిరాధారణకు గురికావడంతో తల్లితో పాటు అభం శుభం తెలియని పసికందు ఆయన ఇంటి ముందు న్యాయ దీక్ష చేస్తున్న గ్రామస్తులను కంట తడిపెట్టించింది. గత మూడు రోజులుగా తల్లి మడ్డు అనూషతో పాటు 11 నెలల ప్రీతిక తండ్రి చూపుకు ఎదురు చూస్తుంది. అయితే కోడలు అనూషని, మనవరాలు చిన్నారి ప్రీతికను తమ ఇంట్లోకి రానివ్వకుండా తాత, నాన్నమ్మలు హైడ్రామా నడుపుతున్నారు. వివరాల్లోకి వెళ్తే... అక్కుపల్లి గ్రామం యంపల్ల అప్పలస్వామి, జానకిల కుమార్తైన అనూషని అదే గ్రామానికి చెందిన మడ్డు రాఘవులు, వరలక్ష్మిల కుమారుడైన సుధీర్‌తో 2022లో వివాహమైంది. అయితే దంపతులు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కావడంలో బెంగుళూరులో కాపురం పెట్టారు. అనూష గర్భిణి కావడంతో సాంప్రదాయ ప్రకారం తన కన్నవారి ఇంటికి వచ్చి పండింటి పాపను జన్మనిచ్చింది. పాప పుట్టిన 11 నెలల తర్వాత ఈ నెల 21న అత్తవారింటికి వచ్చిన అనూషను, చిన్నారి ప్రీతికను ఇంట్లోకి అనుమతించకుండా అత్తమామలు అడ్డుకున్నారు. అప్పటికే ఇంట్లో ఉన్న అనూష భర్త సుధీర్ కూడా మోఖం చాటేశాడు. దీంతో బాధితరాలు తమను ఇంట్లోకి రానివ్వండి అంటూ ప్రాధేయపడినా వారు కనికరించలేదు. ఇంటి వెనుక నుంచి భర్త పరారయ్యాడు. అయితే నీ భర్త ఇంట్లో లేడు... బెంగుళూరులో ఉన్నాడంటూ బదులిస్తూ ఇంట్లోకి రానివ్వలేదని బాధితురాలు అవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయం కోసం బాధితరాలు 100 కాల్ చేసినా ప్రయోజనం లేకపోయిందని వాపోయింది. దీంతో గత మూడు రోజులుగా భర్త ఇంటి ముందు న్యాయ దీక్షకు బాధితరాలు పూనుకుంది. అయితే బాలింతకు న్యాయం చేయాలంటూ ప్రజా సంఘాలు,గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితరాలకు మద్దతుగా నిలిచారు. కాగా, ఇంట్లో ఉన్న బాధితరాల మామయ్య రాఘవులను గ్రామ పెద్దలు, పాత్రికేయులు సంప్రదింపులు చేశారు. నా కుమారుడు ఊరులో లేడని, రెండు రోజుల్లో వస్తాడని, అప్పుడు మాట్లాడుకుందామని సమాధానమిచ్చాడు. కానీ, మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటిలోని మొదటి గదిలోకి బాలింతరాలను అనుమతి అత్తమామలు అనుమతి ఇచ్చారని బాధితురాలు తండ్రి అప్పలస్వామి తెలిపారు.

భర్త ఇంటి ముందు దీక్ష చేస్తున్న భార్య అనూష

రైతుల సమస్యలను పరిష్కరించాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

రైతు సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. మండలంలోని రాజపురంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కాంప్లెక్స్ బస్తా ఎరువుల ధరలను రూ.50 నుంచి రూ.వంద వరకు పెంచిందన్నారు. ఇప్పుడు జిఎస్‌టి తగ్గించినట్లు ఆర్భాటాలు చేస్తుందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులపై భారం పెడుతోందని విమర్శించారు. రైతులు పండించిన ప్రతి పంటనూ దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ వ్యతిరేక విధానాలను విరమించుకోవా లన్నారు. అభివృద్ధి పేరుతో చేపడుతున్న బలవంతపు భూసేకరణలను నిలిపివేయాలన్నారు. అమెరికా మన ఎగుమతులపై విధిస్తున్న 50 శాతం సుంకాలను వ్యతిరేకిస్తూ, రొయ్యలు, పత్తి, పాడి రైతుల సమస్యలను పరిష్కరించాల న్నారు. అలాగే కొబ్బరి పరిశోధనా కేంద్రం, జీడి కార్పొరేషన్ ఏర్పాటు, కరువు పంటలకు నష్టపరిహా రం, ఇన్సూరెన్స్, కౌలు రైతుల సమస్యలు, యూరియా కొరత, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు.

నవంబరు 15,16 తేదీల్లో టెక్కలిలో నిర్వహించనున్న ఎపి రైతు సంఘం జిల్లా 15వ మహాసభలను విజయవంతం చేయాలని పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు బగాది వాసుదేవరావు, కొర్లాన బాలాజీరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మోహనరావు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్ర సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నవంబర్ 14న విజయవాడలో నిర్వహించే బాలల సంఘం రాష్ట్ర సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్ కోరారు. బాలల సంఘం రాష్ట్ర సమ్మేళనం జయప్రదం చేయాలని కోరుతూ క్రాంతిభవన్‌లో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బాల కార్మికులు, బడి బయట పిల్లలు పెరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యకు దూరమై బాలకార్మికులుగా మిగిలిపోతున్నారని, బాలకార్మిక చట్టాలు ఉన్నా పేరుకే తప్ప బాలకార్మికుల నియంత్రణ జరగలేదన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నా నియంత్రణ కరువైందన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్‌లు మాట్లాడుతూ నేటి సమాజంలో యువత మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్‌ను దూరం చేసుకుంటున్న నేపథ్యంలో రాష్ట్ర యువజన సమ్మేళనాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గిరిబాబు, సురేష్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కలిశెట్టిని సన్మానిస్తున్న నాయకులు

ఎంపీ కలిశెట్టికి అభినందనలు

ప్రజాశక్తి- రణస్థలం

ఎచ్చెర్ల నియోజకవర్గం మార్కెట్‌కమిటీ డైరెక్టర్‌గా రణస్థలం మండలానికి చెందిన కెల్ల భారతిని నియామకం చేసినందుకు సహకరించిన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, స్థానిక ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావును కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు, ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకటరమణ, తెలుగుయువత, యూనిట్ ఇన్‌ఛార్జి, బూత్ ఇన్‌ఛార్జిలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బిఎస్ అండ్ హెచ్‌డి విభాగం ఆచార్యుడు కార్తీరాజ్ దాసరి యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ అండ్, ప్రొఫెషనల్ ఎతిక్స్ పుస్తకాన్ని రచించారు. దీనిని కళాశాల డైరెక్టర్, ప్రొఫెసర్ నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ మానవ విలువలతో పాటు వృత్తినైతికత ప్రతి విద్యార్థీ వ్యక్తిత్వ వికాసానికి మూలాధారం అన్నారు. ఇలాంటి పుస్తకాలు యువతలో విలువలతో కూడిన ఆలోచనలను పెంపొందిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక విద్యతో పాటు మానవతా దృక్పథం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ డి.శ్రీరాములు, విభాగాధిపతులు డాక్టర్ రత్నమణి, డాక్టర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చేతన్‌ను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు

వైమానిక దళంలో ఉద్యోగం సాధించిన విద్యార్థి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నిమ్మతొర్లాడ పంచాయతీ పాతూరు గ్రామానికి చెందిన ఎం.చేతన్ భారత వైమానిక దళంలో ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం ఈ విద్యార్థి వాగ్దేవి కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. చేతన్ తండ్రి హిమంతరావు కంప్యూటర్ నెట్ సెంటర్ ఆమదాలవలస పట్టణంలో నడుపుతుండగా తల్లి అన్నపూర్ణమ్మ గృహిణి. చదువుతో పాటు కృషి, పట్టుదలతో వైమానిక దళంలో అవకాశం పొందడంపై కళాశాల యాజమాన్యం ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాగ్దేవి కళాశాల డైరెక్టర్ సిహెచ్ ప్రవీణ్, ఎఒ గురుగుబిల్లి రాజు, బుడుమూరు శ్రీరంగనాయకులు తదితరులు చేతన్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నతనంలోనే ఉద్యోగం సాధించడంపై గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే సారూ పరిష్కారం చూపరూ..

బిసి కాలనీవాసుల మొర

ప్రజాశక్తి- బూర్జ

ఎమ్మెల్యే సారు, మా మొర ఆలకించరు అంటూ మండల కేంద్రంలోని బిసి కాలనీ వాసులు ఎమ్మెల్యే కూన రవికుమార్ వద్ద మొరపెట్టుకున్నారు. గురువారం మండల కేంద్రంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటి కుళాయిల ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి కాలనీ సమస్యలను తీసుకువచ్చారు. మండల కేంద్రంలో కూత వేటు దూరంలో మండల శాఖ అధికారులు వున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావడంలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దశాబ్దాల కాలంగా బిసి కాలనీలో సమస్యలు నెలకొని ఉన్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదని, అధికారులు పట్టించుకోవడంలేదని ఎమ్మెల్యేకి విన్నవించారు. ముఖ్యంగా రహదారి సౌకర్యం, సైడ్ కాలువలు లేకపోవడంతో మురుగునీరు రహదారిపైనే పారుతుందన్నారు. అత్యవసర సమయంలో బిసి కాలనీలోకి 108 వంటి వాహనాలు రావడం లేదని వాపోయారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి

బిసి కాలనీలో రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. సమస్యలు కనిపిస్తున్నప్పటికీ పరిష్కారానికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అన్ని శాఖల అధికారులు మూడు రోజుల్లో కాలనీవాసుల సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. తన దృష్టికి మరలా సమస్యలు వచ్చినట్లయితే తాను సహించబోనని అధికారులను హెచ్చరించారు. అంతకుముందు కాలనీ పరిస్థితులను ఎమ్మెల్యే రవికుమార్ స్వయంగా బిసి కాలనీకి వెళ్లి పరిశీలించారు.

ఉపాధ్యాయులకు పురస్కారం అందజేస్తున్న రామరాజు

రామరాజు విద్యా పురస్కారం ప్రదానం

మెళియాపుట్టి: మండలంలోని నేలబొంతు జిటిడబ్ల్యుఎజిహెచ్ పాఠశాలలో పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, స్వచ్ఛాంధ్ర అవార్డు గ్రహీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూరవెల్లి విజయభారతికి గురువారం రామరాజు విద్యా పురస్కారం ప్రదానం, సన్మానం చేశారు. అలాగే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు సవర గంగారావు, గేదెల గిరిజ, పద్మావతిలకు అభినందన పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి కథల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ట్రస్టు తరుపున జ్ఞాపికలను బహుకరించారు. ముఖ్య అతిథులుగా ఎటిడబ్ల్యుం పుల్లేటికుర్తి సూర్యనారాయణ, ఎంఇఒ-2, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మల్లారెడ్డి పద్మనాభం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లభ మల్లయ్య, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లింగాల సంజీవరావు పాల్గొన్నారు.

ప్రభాస్ జన్మదిన వేడుకలు

శ్రీకాకుళం సిటీ: నగర పరిధిలోని ఏడురోడ్ల జంక్షన్ ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో గురువారం ప్రభాస్ జన్మదినం సందర్భంగా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో కేకుకట్ చేసి అనంతరం పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాస్‌నాయుడు, ప్రభాస్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో మహిళలకు, బాలికలకు భద్రత కరువైందని వైసిపి జిల్లా మహిళా అధ్యక్షులు ఉలాల భారతీ దివ్య ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా తుని ప్రాంతంలో జరిగిన దారుణ ఘటన సమాజం మొత్తాన్ని కుదిపేసిందన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ మళ్లీ జరగకూండా చూడాలన్నారు. ప్రతి కుటుంబం, పాఠశాల, కళాశాల స్థాయిలో డిజిటల్ నైతికతపై చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళల గౌరవం, రక్షించడం సమాజం మొత్తం బాధ్యత అన్నారు. ఘటన వెనుకపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధిత కుటుంబానికి మద్దతుగా నిలవాలన్నారు.

సత్యసాయి భజన మండలి సేవా స్ఫూర్తి

కవిటి: మండలంలోని రాజపురానికి చెందిన సత్యసాయి భజన మండలి సేవా స్ఫూర్తితో ఆదర్శంగా నిలుస్తోంది. సత్యసాయి అమృత కలశ సేవ పేరుతో ప్రతినెలా మూడు పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తోంది. అందులో భాగంగా మండలంలోని చింతామణి కాలనీకి చెందిన ప్రజాశక్తి విలేకరి, కీర్తివేషులు బసవ జగన్ కుటుంబానికి, ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పొందూరుపుట్టుగకు చెందిన దూగాన రామ్మూర్తి కుటుంబానికి, మెళియాపుట్టుగకి చెందిన కొన్నాయి జగ్గారావు కుటుంబానికి నెల రోజులకు సరిపడే నిత్యావసర సరుకులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

33 కెవి బలగ, హయతీనగర్ ఫీడర్ మరమ్మతులు శుక్రవారం నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ ఇఇ పి.యోగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ పురుషుల కళాశాల రోడ్డు, భూబామ్మా నగర్, బలగమెట్టు, కోర్టు సముదాయం, నారాయణమ్మ కాలనీ, భావాజీతోట, ఆదివారంపేట, హోమియో నగర్, తోట పాలెం, దుప్పలవలస, తవిటయ్య నగర్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని అలికాం, చల్లపేట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు శ్రీకాకుళం రూరల్ మండలం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చెట్టు కొమ్మలు తొలగింపు, స్టేషన్లలో మరమ్మతుల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చల్లపేట, అలికాం, బైరి, కరజాడ, నైర, ఒప్పంగి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ప్రమాణపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బెజ్జిపురంలో హిందీమంచ్ సభ

లావేరు: హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బెజ్జిపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హిందీ ప్రమాణ పత్ర వితరణ సభ జరిగింది. హిందీ మంచ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొంపివలస రామారావు ఆధ్వర్యంలో పలు హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు హిందీ ప్రమాణ పత్రాలను అందజేశారు. సభకు అధ్యక్షత వహించిన హైస్కూల్ హెచ్‌ఎం సామవేదుల రమణ మాట్లాడుతూ హిందీ భాషపై భయాన్ని పోగొట్టుకోవాలని, హిందీని కష్టంగా కాకుండా ఇష్టంగా నేర్చుకుని చదవాలన్నారు. మంచ్ ప్రధాన కార్యదర్శి రామారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో హిందీ భాషపై భయాన్ని పోగొట్టడానికి ఏటా వివిధ హిందీ పోటీలను, హిందీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వి.పద్మావతి, సునీల, భారతి, వెంకట్రావు, మురళి, నీలాద్రి, చిరంజీవి, రమణమూర్తి, యశోద, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులకు హిందీ ప్రమాణ పత్రాలను ప్రదానం చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

శ్రీకాకుళం సిటీ: ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో క్షేత్రస్థాయిలో అవగాహన అవసరమని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. జిల్లా వ్యవసాయ శిక్షణ కార్యాలయంలో గురువారం క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలు, ఉద్యానవన సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రధానంగా రసాయన ఎరువులు, పురుగుల మందు వినియోగం తగ్గాలన్నారు. సహజ ఎరువులు వినిమోగం పెరగాలని చెప్పారు. ఘన, ద్రవ జీవామృతం కషాయాలు వినియోగం పెరగాల న్నారు. వ్యవసాయ యాజమాన్య పద్ధతులు మార్పు వల్ల రైతులకు ఖర్చు తగ్గుతాయని, వ్యవసాయం లాభసాటిగా మా రుతుందన్నారు. గ్రామం యూనిట్‌గా రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎడిషనల్ డిపి ఎం. ధనుంజయ రావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనకు కృషి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనకు కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. పట్టణంలో తేజ ఫంక్షన్ హాల్‌లో పిఆర్‌టియు మండల అధ్యక్షులు సుకాంత్ లిమ్మాయి అధ్యక్షతన ఇటీవల ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా గురువారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ అసిస్టెంట్లకు లెక్చరర్లగా ఉద్యోగోన్నతులు కల్పించడం ప్రథమమని అన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలోనూ కంప్యూటర్ ఆపరేటర్ మంజూరు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ సున్నాముద్ది విశ్వనాథం, పిఆర్‌టియు జిల్లా శాఖ

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు

అధ్యక్షులు తంగి మురళీమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ నగిరి శరత్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రవికుమార్, రమేష్ పాణిగ్రహి ఆపస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేష్, ఆపస్ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జోనల్ ప్రెసిడెంట్ కొయ్య పద్మనాభంరెడ్డి పాల్గొన్నారు.

నువ్వలరేవు అప్రోచ్ రోడ్డుకు త్వరలో మోక్షం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

మండలంలోని నువ్వలరేవు- మంచినీళ్లపేట బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష నేతృత్వంలో మోక్షం లభించనుంది. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో రెవెన్యూశాఖ అధికారులతో గురువారం రాత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి హయాంలో ఆ ప్రాంత ప్రజల ప్రయాణ కష్టాలను దూరం చేసేందుకు అప్పటి ఎమ్మెల్యే, తన తండ్రి గౌతు శ్యామసుందర శివాజీ కృషి చేశారన్నారు. ఈ నేపథ్యంలో మంచినీళ్లపేట గ్రామం వైపు అప్రోచ్ రోడ్డు పూర్తయ్యిందన్నారు.

ఇంతలో వైసిపి అధికారంలోకి వచ్చి ఆ పనులను నీరు గార్చి, ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయలేదని అన్నారు. అయితే అభ్యంతరంగా నిలిచిన ఆ పనులను పూర్తిచేసేందుకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవ చూపిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో అప్రోచ్ రోడ్డు నిర్మాణం, నిర్వాసితుల సమస్యలు, ప్రత్యామ్నాయం, పరిహారం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆర్‌డిఒ జి.వెంకటేష్, ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

భూమిని కాపాడి భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- రణస్థలం

తన ఆధీనంలో ఉన్న భూమిని కాపాడి భద్రత కల్పించాలని మండలంలోని బంటుపల్లి పంచాయతీ కంబాలపేటకు చెందిన పాశపు శ్రీనివాసరావు స్థానిక జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఆనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బంటుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ ప్రస్తుతం 26/9లో 3.71 ఎకరాలు తమ స్వాధీనంలో ఉన్న భూములో జీడితోట, టేకు చెట్లు ఉన్నాయని వాటిని పోందూరు మండలం బొట్లపేట గ్రామానికి చెందిన గురాల సుమంత్, యాగాటి పాలేం గ్రామానికి చెందిన కొరిపల్లి శ్రీనువాసరావు, కొరిపల్లి వీరబాబులు, కొరిపల్లి రాధాకుమారి నలుగురు కలిసి తమ భూములో వున్న జీడి, టేకుచెట్లును కూలీలను పెట్టి దౌర్జన్యంగా నరికి పట్టుకొని వెళ్లి పోతున్నారన్న విషయం తెలుసుకుని అడగ్గా తనపై హత్యప్రయత్నం చేయడానికి ప్రయత్నించారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు తనకు, తన కుటుంబానికి భద్రత

విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కల్పించి, తన భూమిని, చెట్లును వారు పట్టుకుపోకుండా కాపాడాలని కోరారు. ఈ విషయంపై గురాల సుమంత్‌ను వివరణ కోరగా ఈభూమి విషయంలో గొడవలు జరగడంతో కోర్టును ఆశ్రయించడం జరిగిందని, రెండేళ్ల క్రితమే హైకోర్టులో భూమిని గెలుచు కోవడం జరిగిందని, ప్రస్తుతం భూమి నా ఆధీనంలో ఉందని, చెట్లు కొడుతుంటే పాశపు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో వచ్చి అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ బాలరాజు

పోలీస్‌స్టేషన్లలో 'ఓపెన్‌హౌస్'

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు ంసదర్భంగా మండలంలోని చాపర ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ సిబ్బంది తమ విధులు, బాధ్యతలు, పోలీసులు సమాజంలో నిర్వహించే సేవల గురించి విద్యార్థులకు ఎస్‌ఐ పి.రమేష్‌బాబు వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా ప్రశ్నలు అడిగి పోలీసు విధానాలపై అవగాహన పొందారు.

సంతబొమ్మాళి : అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నౌపడ ఎస్ఐ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. నౌపడ జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రికార్డులు, సిబ్బంది విధులు, అలాగే ప్రజలు పోలీస్ సహాయం ఎలా పొందాలో విద్యార్థులకు వివరించారు.

ఆమదాలవలస: విద్యార్థులు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్‌లో జరిగే పరిణామాలు, కార్యక్రమాలపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఎస్ఐ సనపల బాలరాజు అన్నారు. గురువారం పట్టణంలో పాఠశాల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే రికార్డుల విధానం, పోలీసుల విధులు, బాధ్యతలు, ఆయుధాల కోసం క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న తహశీల్దార్ పాపారావు

పంట సర్వేపై సమీక్ష

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పంట స్థితిగతులపై సమగ్ర సమాచారం సేకరించి నివేదికలు సమర్పించాలని తహశీల్దార్ బడే పాపారావు వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులకు సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో పంట సర్వే అంశంపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట సర్వేను సమయానికి పూర్తి చేయడం, రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహప్రసాద్ పండా, ఎఒ ఎస్.దానకర్ణుడు, హౌసింగ్ ఎఒ గణేష్ కుమార్, సచివాలయ విఎఎలు, హార్టికల్చర్, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

నగదు అందిస్తున్న సభ్యులు

ఎస్‌జిఎఫ్ సహాయం

కవిటి: కంచిలి మండలం చిన్న కొజ్జిరియా కూడలి సమీపంలో ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో పొందూరుపుట్టుగకు చెందిన దూగాన రామ్మూర్తి, కుమారుడు ప్రణయ్ తీవ్రంగా గాయపడ్డ విషయం విదితమే. వీరిలో ప్రణయ్ కోలుకొని ఇంటికి చేరుకోగా, రామ్మూర్తి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరి వైద్యం కోసం రూ.10 లక్షలు ఖర్చవుతుందని తెలుసుకున్న ఎస్‌జిఎఫ్ సంస్థ బాధిత కుటుంబానికి రూ.15 వేలు ఆర్థికసాయం అందించింది. కార్యక్రమంలో సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

వజ్రపుకొత్తూరు: మండలంలో ఇటీవల కాలంలో మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి గౌతు శివాజీ గురువారం పరామర్శించారు. గడూరులోని కోడ వరలక్ష్మి, సాతుపల్లి భానుమతి, పొట్టి పితాంబరం ఒంకులూరు చిడిపల్లి రామారావు, నర్తు సింహాద్రి, అక్కుపల్లిలో సాగూరు గణపతిరావు కుటుంబాలను కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు టిడిపి మండల అధ్యక్షుడు మోహనరావు, శాంతమూర్తి, ఎంపిటిసి సురేఖ, మోస వరప్రసాద్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న శివాజీ